అనువాదకుడి చివరి మాట....

ఇక్కడ పుస్తకాన్ని సమీక్షించడం నా ఉద్దేశ్యం కాదు. అది నా కర్తవ్యమూ కాదు. న్యాయమూ కాదు. తన పరిమితులేమిటో రియస్ తన ముందు మాటలో నిస్సంకోచంగా చెప్పుకున్నాడు. కొన్ని ముఖ్య విషయాలను మాత్రం పాఠకుడి దృష్టికి తేవాలి.

బహుశా పుస్తకం చదవగానే స్ఫురించేది రియస్ 'పాశ్చాత్య కేంద్రత్వం (WEST-CENTREDNESS). ఎక్కడా గూడా ఆసియా ఆఫ్రికాలాంటి ప్రాంతాలు ప్రపంచంలో ఉన్నాయన్న గుర్తింపు కనిపించదు. పర్యవసానంగా - ఒక్క ఉదాహరణ మాత్రమే - గ్రీకు తత్వవేత్త అయిన థేల్సును తత్వశాస్త్ర పితగా పరిగణిస్తారని అన్నాడు. థేల్స్ గొప్ప తత్వజ్ఞానుడు కాడని కాదు గాని, ఆయనకంటె పూర్వీకులు, ఆయన కంటే ఎక్కువ ప్రభావం గలవారు మన దేశాలలో ఉన్నారు - ఉపనిషత్కర్తలు, బుద్ధుడు, చైనీయుడయిన కన్ఫ్యూషియస్. కొన్ని ఉదాహరణలు మాత్రమే.

రెండవది, పెట్టుబడిదారీ సమాజానికి సంబంధించి కొంత గందరగోళం. పెట్టుబడిదారీ సమాజ చరిత్రలో రెండు దశలున్నాయి. మొదటి దశలో పెట్టుబడిదార్లు సాంకేతిక అభివృద్ధిని సాధించలేదు. కేవలం, విడి విడిగా ఉన్న ఉత్పత్తి సాధనాలను ఒక ఫ్యాక్టరీ కప్పుక్రిందకి చేర్చడం, ఉత్పత్తి క్రమాన్ని విడగొట్టి, ఉత్పాదకతకు దోహదకారి అయిన 'ఫ్యాక్టరీలో శ్రమ విభజన' ప్రవేశపెట్టడం మాత్రమే జరిగింది. రెండవ దశలో సాంకేతిక పురోభివృద్ధి వచ్చింది. 18వ శతాబ్దపు చివరి భాగంలో ఆవిరి శక్తిని కనుగొని, వస్త్రోత్పత్తిలో సాంకేతిక అభివృద్ధి సాధించడంతో మొదలయింది పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం. ఈ రెండు దశలకు స్పష్టంగా తేడా చూడక పోవడం వల్ల, ఈ పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాన్నే పెట్టుబడిదారీ విధానం అని ఒకటి రెండు చోట్ల అనడం జరిగింది. ఈ పొరబాటుకు మూలం ఎంగెల్సు తొలి రచనలలో ఉన్న మాట వాస్తవమే; కాని ఆ పొరబాటును తరువాతి కాలంలో మార్క్స్, ఎంగెల్సు దిద్దుకున్న విషయం గూడ గుర్తించాలి.

వర్గ సమాజం ఏ విధంగా పుట్టిందన్న విషయం గురించి గూడ కొంత అస్పష్టత వుంది. స్థిర వ్యవసాయం రావడంతో సాధ్యమయిన అదనపు ఉత్పత్తి వర్గ సమాజానికి దారి తీసిందన్నది మార్క్సిస్టు అవగాహన. అట్లా కాకుండ పురోహితులు కుట్టు పన్ని ప్రజలను మోసం చేయడం కోసం మతాన్ని సృష్టించి వర్గ సమాజాన్ని ఏర్పరిచారన్న అభిప్రాయం పుస్తకం మొదటి పేజీలు కలిగిస్తాయి.

ముఖ్యంగా చెప్పవలసిన విషయాలు ఇవి మూడు. మిగతా లోపాలు సమీక్షకుల వంతు.

కె. బాలగోపాల్

MARX FOR BEGINNERS
BY RIUS 1976
కార్టూన్లలో మార్క్సు
తెలుగుసేత: కె. బాలగోపాల్
ప్రచురణ హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 1982 బుక్